## క్లుప్తంగా

### మౌలిక వసతుల కల్పనకు కృషి



మున్సిపల్ వైస్ చైర్మన్‌ను సత్కరించిన సొసైటీ సభ్యులు

**మదనపల్లె:** పట్టణంలోని శేషప్పతోటలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి అన్నారు. ఆదివారం శేషప్పతోట డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రతినిధులు తెలియజేశారు. సిమెంటురోడ్లు, తాగునీటి పైప్‌లైన్లు, మురికినీటి కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ నిధులతో పనులు చేపట్టేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జింకా, అసోషియేషన్ ప్రతినిధులను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జి.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు మురళీ నరసింహ, కార్యదర్శి తిలక్, కోశాధికారి సరస్వతమ్మ, రిచర్డ్, క్రిస్టోఫర్, నవరంగ్ బాషా, శ్రీరాములు, విరూపాక్షరావు, రామచంద్ర పాల్గొన్నారు.

### అక్రమ కేసులు ఎత్తివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బాస్ నాయకులు

**పెద్దతిప్పసముద్రం:** భారతీయ అంబేడ్కర్ సేన నాయకులపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని బాస్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాస్ నాయకులు కేవీ రమణ, సింగన్న, సచిన్, రామచంద్ర, మాధవ, రమణ, వెంకటేష్ ఆదివారం పీటీఎం, బి.కొత్తకోట మండల కేంద్రాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి సమీపంలోని బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్‌తో పాటు బాస్ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం సబబు కాదని హితవు పలికారు.

### వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొనండి

**కలకడ:** దివంగిత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కలకడ మూడురోడ్లు కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, కేక్‌కట్ చేసి పండ్లు, మిఠాయిలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరారు.


### 'అభయ'తో విద్యార్థులకు భవిత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, విద్యార్థులు

**గుర్రంకొండ:** అభయ ఫౌండేషన్ పది సూత్రాలు విద్యార్థుల జీవితాలకు ఎంతో ఉపయోగపడతాయని రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక లేపీ గురుకుల బాలికల పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ సంస్థ సహకారం బాలికల రక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు తమ రక్షణ కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అభయ పదిసూత్రాల్లో భాగంగా బాలికలు అప్రమత్తంగా ఉండడం, భద్రత కోసం సామగ్రిని అందుబాటులో ఉంచుకోవడం, ఆపద సమయంలో సాయం కోరడం, గట్టిగా అరవడం, టోల్‌ఫ్రీ నెంబర్లు 1098, 100పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు శీనమ్మ, వాసంతి పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



రోగుల రిపోర్టులను పరిశీలిస్తున్న వైద్యులు

**పెద్దతిప్పసముద్రం:** మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరవాండ్లపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో జరిగిన ఈ శిబిరంలో గుండె, క్యాన్సర్, కీళ్ల సమస్యల వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు రెడ్డిబాషా, అనిల్, చంద్ర, కరుణాకర్ పాల్గొన్నారు.

# కులమతాలకతీతం మొహర్రం వేడుకలు

- భక్తి శ్రద్ధలతో పూజలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



రామసముద్రం: పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

**మదనపల్లె సిటీ:** మొహర్రం ఉత్సవాలను హిందూ, ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూబజార్‌లోని తాటిమాన్ల మకాన్ వద్ద ఏర్పాటు చేసిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లను పూలతో అలంకరించారు. భక్తులకు పీర్లను దర్శించుకుని కొబ్బరిని అగ్నిగుండంలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లను నెహ్రూబజార్, ఆర్‌ఆర్‌వీధి, అగడ్తవీధి, శాస్త్రీవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి జల్ది చేశారు. అలాగే జామియా మసీదు వద్ద ఏర్పాటు చేసిన పపయా మకాన్ వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**శుభాకాంక్షలు**

**బి.కొత్తకోట:** శాంతి, దయ, కరుణకు మొహర్రం ప్రతీకని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మొహర్రం పండగ సందర్భంగా ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొహ్మద్ ప్రవక్త హాజరత్ ఇమామ్ హుస్సేన్ అలైహిస్సలాం బలిదానానికి గుర్తుగా నిర్వహించుకునేదే మొహర్రం అని అన్నారు.

**వైభవంగా పీర్ల బాబయ్యల ములకత్**

**రామసముద్రం:** రామసముద్రం మండల కేంద్రంలో పీర్ల బాబయ్యల ములకత్ కులమతాలకతీతంగా వైభవంగా నిర్వహించారు. ఆర్.నడింపల్లి, తిరుమలరెడ్డిపల్లి, రామసముద్రం, ఎగువ, దిగువపేటకు చెందిన పీర్ల బాబయ్యలను ప్రత్యేక ప్రభలపై అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అయితే దిగువపేటలో ఆర్.నడింపల్లెకి, దిగువపేట యువకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఆర్.నడింపల్లికి చెందిన పీర్ల బాబయ్యలను వెనక్కి తీసుకెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. అనంతరం యువకులు ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ వెళ్లి దిగువపేటలోని మైదానంలో పీర్ల బాబయ్యలను ములాకత్ చేసి మొహరం వేడుకలు ముగించారు.

**ప్రత్యేక పూజలు**

హిందు ముస్లింల ఐక్యతకు మొహర్రం వేడుకలు నిదర్శమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి తెలిపారు. నివారం రాత్రి రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లె గ్రామంలో పీర్ల బాబయ్యకు పూజలు నిర్వహించారు.

**వైభవంగా పీర్ల పండుగ**

**పీలేరు రూరల్:** పీర్ల పండగను హిందూ ముస్లింలు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం పీలేరు పట్టణంలోని మోడల్‌కాలనీ, రేగళ్లు, తలపుల గ్రామాలలో పీర్ల పండగను నిర్వహించారు. పీలేరు టౌన్‌లోని కోటపల్లె, యల్లమందక్రాస్, నాలుగురోడ్లు కూడలి, గాంధీరోడ్, బ్రాంహ్మణ వీధులలో ఊరేగించారు. సర్పంచ్ అమరనాథరెడ్డి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్వకాలం నుంచి హిందూ ముస్లింలు కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పర్వదినానికి గ్రామాల్లో ఎంతో ప్రత్యేకత ఉంది. పట్టణాలు, గ్రామాలు అన్నతేడా లేకుండా వారం రోజుల పాటు హిందూ ముస్లింలు భాయి.. భాయి.. అంటూ మొహర్రం పర్వదినంలో పాల్గొని పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో తాటిమాన్ల పీర్లు



పీలేరు: పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

# ఎరుకలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న తంబళ్లపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు

**మదనపల్లె సిటీ:** ఎరుకలు రాజకీయ, విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డివిజన్ ఎరుకల ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.రమణ ఆకాంక్షించారు. ఆదివారం మదనపల్లె పట్టణంలో ఎరుకల ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అక్షయ ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎరుకల కోసం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఎరుకులకు సీట్లు కేటాయించాలన్నారు. రాజకీయంగా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. వెనుబడిన ఎరుకుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తంబళ్లపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏకలవ్యుడు అస్త్రశస్త్ర, విలువిద్యలు, వనమూలికలతో వైద్యం తెలిసిన మహా శాస్త్రవేత్త అని కొనియాడారు. ఎరుకలు ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎరుకుల ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిల్లా నాగరాజు, కోశాధికారి మల్లెల విశ్వనాథం, ఉపాధ్యక్షుడు రాజన్న, పి.వి.రమణ, ఆర్‌జీఎస్ అధ్యక్షుడు కోనేటి దివాకర్, గంగాధర్, బొజ్జప్ప, మోహన్‌వల్లి, శివహరిప్రసాద్, ప్రకాష్, పూల వెంకటరమణ పాల్గన్నారు.

# రెడ్డెమ్మకొండలో భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు



రెడ్డెమ్మ ఆలయానికి విరాళం ఇస్తున్న దాతలు

**గుర్రంకొండ:** మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయంలో చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా పేరుపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు.

**ఆలయానికి విరాళం**

మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన సంతాన దేవత శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయానికి రూ.50,012 ను దాతలు విరాళంగా అందజేశారు. బి.కొత్తకోట మండలం ఈడిగ పల్లెకు చెందిన బి.ఎర్రంరెడ్డి రూ.25012, గాలీవీడుకు చెందిన తమటం వెంకటరమణారెడ్డి రూ. 25 వేలును అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం విరాళంగా అందజేశారు. ఆదివారం దాతలు ఆలయానికి చేరుకొని ఆలయఅధికారి బాలకృష్ణారెడ్డికి విరాళం మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ సిబ్బంది సన్మానించారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

**కలికిరి(వాల్మీకిపురం):** వాల్మీకిపురం పట్టణ పరిధిలోని పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980–81 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి చదివిన 45 ఏళ్ల తరువాత అప్పటి విద్యార్థులు సమావేశమవ్వడంతో పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో సందడి నెలకొంది. ఈ బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది 60 ఏళ్ల వయస్సు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురికి షష్టిపూర్తి కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పూర్వ విద్యార్థులు సుదర్శన్, చింతల విజయ్ రెడ్డి, మనోహర్, రఘురాం, డా.జూనం గంగిరెడ్డి, కేశవరెడ్డి, వెంకటరమణ, హరినాథ శర్మ, సత్యనారాయణ, పద్మలత, శైలజ, శోభారాణి, శ్రీలక్ష్మీ, సుజాత, విద్యావతి పాల్గొన్నారు.

# ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

**మదనపల్లె సిటీ:** జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను ఆ పార్టీ మండల రూరల్ అధ్యక్షుడు టి.వెంకటరమణారెడ్డి కొనియాడారు. జనసంఘ్ వ్యవస్థాపకుడిగా, బిజెపిలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్రకుమార్‌రెడ్డి, బాలజ్యోతి, గంధర్వరెడ్డి, సాయిగోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

**మదనపల్లె సిటీ:** అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పశుసంవర్ధశాఖ డివిజన్ సంచాలకులు డాక్టర్ నీరజ మాట్లాడుతూ నేడు కుక్కల పెంపకంపై శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఇష్టంగా పెంచుకునే జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందని వెల్లడించారు. పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రాబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైందని తెలిపారు. పశువుల వ్యాధులపై సలహాల కోసం ప్రభుత్వం 1962 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి, మండల పశువైద్యాధికారి ప్రసాద్, లారా, సిబ్బంది పాల్గొన్నారు.


**యాంటీ రేబీస్ టీకాలు వేయించాలి**

**పెద్దమండ్యం:** పెంపుడు కుక్కలకు ప్రతి ఏడాది యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని వెలిగల్లు వెటర్నరీ డాక్టర్ చరిత అన్నారు. వెలిగల్లు పశువైద్యశాలలో ఆదివారం అంతర్జాతీయ జూనోసిస్ సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని తెలిపారు. లూయీస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి టీకా వేశారని గుర్తు చేశారు. దీంతో ప్రతి ఏడాది జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకొంటామని తెలిపారు. పశువుల నుంచి సంక్రమించే వ్యాధులలో బర్డ్‌ఫ్లూ, ఆంత్రాక్స్, బ్రూసెల్లా, రాబీస్ వంటివి చాలా ప్రమాదకరమైన వ్యాధులని తెలిపారు. ఈ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మధు, గోపాల మిత్ర మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


**తంబళ్లపల్లె:** అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, మొబైల్ వెటర్నరీ క్లినిక్ డాక్టర్ ఇందు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కుక్కల యజమానులకు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, రాబిస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం: అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు పశువైద్యాధికారి పావని యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేబిస్‌వ్యాధి నివారణ కోసం పెంపుడు కుక్కలు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. రేబిస్ వ్యాధి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

**కలికిరి:** అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేసినట్లు సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటమునినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే జబ్బులు, ముందస్తు నివారణ మార్గాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఏటా పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రాబిస్ టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ గిరినాథ్ రెడ్డి, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ కీర్తి, పశువైద్య సహాయకులు రాజ్‌కుమార్, వంశీ, లతీష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె సిటీ: పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశుసంవర్ధశాఖ డీడీ నీరజ



కలికిరి: కుక్కకు టీకా వేస్తున్న ఏడీఏ వెంకటమునినాయుడు

# తొలి ఏకాదశి.. శుభాల రాశి



మదనపల్లె: అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో వేంకటరమణస్వామి, అమ్మవార్లు



రామసముద్రం: పూజలందుకున్న లక్ష్మీజనార్దనస్వామి, అమ్మవార్లు

**మదనపల్లె:** తొలి ఏకాదశి.. శుభాల రాశి అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక అమ్మచెరువుమిట్ట శేషాచల నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. హోమం, కళ్యాణోత్సవ వేడుక, భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏకాదశి వేడుక హిందువులకు విశిష్టమైనదని పేర్కొన్నారు. అలాగే మదనపల్లె రూరల్ మండలం కొత్తిండ్లకు చెందిన కార్యకర్త షేక్ ఫిరోజ్ ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను నిస్సార్ అహ్మద్ పరామర్శించారు. ఆయనవెంట యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇర్ఫాన్, హబీబ్, విజయ్, రమేష్‌బాబు, మునిశేఖర్, బయ్యారెడ్డి, రమణ, నరసింహులు, మల్లికార్జున, కిషోర్, యూనస్, హబీబ్, శంకర పాల్గొన్నారు.

**ఘనంగా తొలి ఏకాదశి**

**మదనపల్లె సిటీ:** తొలి ఏకాదశిని ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో యోగభోగేశ్వరుడికి మహన్యాస ఏకదశవార రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు.

స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక హోమాలు, రుద్రాభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**జనార్దనస్వామి ఆలయంలో..**

**రామసముద్రం:** మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీజనార్దనస్వామి ఆలయంలో తొలిఏకాదశి పురస్కరించుకుని ఆదివారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కులశేఖర్‌బట్టర్ స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

### సమ్మె జయప్రదం చేయండి

**బి.కొత్తకోట:** ఈనెల తొమ్మిదిన చేపట్టనున్న సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, నియోజకవర్గ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పని గంటల పెంపు, లేబర్ కోడ్స్ రద్దు తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్టు తెలిపారు.

### లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**రాయచోటి జగదాంబసెంటర్ :** బీజేపీ ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలు, హక్కులను కాలరాస్తోందని బీజేపీ చేస్తున్న కార్మిక కర్షకోద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జూలై 9న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, కర్షక శ్రేణులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులను సంఘటితం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

## ఫార్మసీ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**మదనపల్లె సిటీ:** మదనపల్లె సమీపంలోని మహిత ఫార్మసీ కాలేజీ యాజమాన్యం నుంచి విద్యార్థులకు ఫీజులు వేధింపులు నుంచి రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం కాలేజీ ఎదుట నిరసన తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. కాలేజీ అటానమస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకే క్యాంపస్‌లో కాలేజీ, బాలికల హాస్టల్ రెండు నిర్వహించడం యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధమన్నారు. యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ న్యూఢిల్లీ స్పందించి విచారణ జరిపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాల నుంచి ఫీజులు వేధింపులు ఆపాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, సుల్తాన్, బన్నీ, శివాజీ రులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సంతాపం



పెద్ద రెడ్డెప్ప రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, నాయకులు

**కలికిరి(వాల్మీకిపురం):** మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన వేపమాకుల పెద్ద రెడ్డెప్ప రెడ్డి ఇటీవల మృతి చెందారు. వారి స్వగ్రామంలో ఆదివారం ఆయన దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పెద్ద రెడ్డెప్ప రెడ్డి చిత్రటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. రెడ్డెప్పరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, టెలికాం కమిటీ సభ్యుడు శ్రీధర్ రాయల్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

# నీటి తొట్ల వెలవెల.. పశువులు విలవిల

పశువుల దాహార్తి తీర్చడానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా మూగజీవాలు నీళ్లు దొరక్క దప్పికతో తల్లడిల్లుతున్నాయి. గ్రామాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

- నిరుపయోగంగా తొట్లు
- తీరని మూగజీవాల దాహం
- పట్టించుకోని అధికారులు



చిట్టిబోయనపల్లెలో నిరుపయోగంగా పశువుల నీటి తొట్టె

**గుర్రంకొండ:** మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో పశువుల దాహార్తి తీర్చడానికి పశుసంపద లెక్కల ఆధారంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా 32 నీటి తొట్లు నిర్మించారు. అయితే వర్షాలు కురవక చెరువుల్లో చుక్క నీరులేక తాగునీటి కోసం పశువులు అల్లాడిపోతున్నాయి. తొట్టెలు నిర్మించిన గ్రామాల్లో నీటిని నింపే బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బోర్ల నుంచి పైప్‌లైన్లు ద్వారా తొట్టెలకు నీటి సరఫరా సౌకర్యం కల్పించారు. దీంతో పశువులు, గొర్రెలు, మేకలు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

**నీటి వసతి ఏది?**

మండలంలో కొన్ని గ్రామాల్లో పశువుల నీటి తొట్టెలకు నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. హడావిడిగా నీటి తొట్టెల నిర్మించారు. అయితే నెలలు గడుస్తున్నా ఇంతవరకు పంచాయతీ శాఖ అధికారులు నీటి వసతి కల్పించలేదు. దీంతో గుక్కెడు నీరు దొరక్క మూగజీవాలు అల్లాడిపోతున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్టెలు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. పశువుల నీటి తొట్టెలకు నీరు నింపడం లేదని ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారుల దృష్టికి తీసుకు రావడం గమనార్హం. ఈ విషయమై ఏపీఓ జయరామిరెడ్డిని వివరణ కోరగా కొత్తగా మంజూరైన నీటితొట్టెల నిర్వహణ బాధ్యత మాత్రమే తమకు వర్తిస్తుందని తెలిపారు. నిర్మాణాలు పూర్తి చేసుకొన్న నీటి తొట్టెలకు నీటి వసతి కల్పించే బాధ్యత, వాటి నిర్వహణ పంచాయతీ అధికారులదేనని పేర్కొన్నారు.